సమగ్ర సర్వే పారితోషికమేది?



నిధులు విడుదల చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

- ఐదు నెలలుగా ఎదురుచూపులు
- ఇంకా జమకాని నిధులు

బోథ్: జిల్లావ్యాప్తంగా గతేడాది సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టారు. ఇందులో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన చేపట్టారు. ఈ సర్వే చేసిన గణకులు (ఎన్యుమరేటర్లు), సూపర్‌వైజర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటికీ నయా పైసా చేతికి రాలేదు. దీంతో పారితోషికం కోసం వారికి ఐదు నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు.

తప్పని ఎదురుచూపులు..

సమగ్ర సర్వే పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, జూనియర్ అసిస్టెంట్లు ఎన్యుమరేటర్లుగా పనిచేశారు. సూపర్‌వైజర్లుగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖలకు చెందిన అధికారులను నియమించారు. వీరిలో ఎన్యుమరేటర్లకు రూ.10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేల చొప్పున పారితోషికం అందజేస్తామన్నారు. సర్వే పూర్తయిన తర్వాత డేటా నమోదు ఆపరేటర్లను తీసుకున్నారు. ఒక్కో సర్వే ఫారమ్ వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసినందుకు రూ.25 చొప్పున చెల్లిస్తామని పేర్కొన్నారు. డేటాఎంట్రీ ఆపరేటర్లుగా కంప్యూటర్‌పై అవగాహన ఉన్న చాలా మందిని తీసుకున్నారు. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువకులు సర్వేకు సంబంధించిన డాటాను ఎంట్రీ చేశారు. పని పూర్తిచేసినా ఇంకా డబ్బుల ఊసే లేకుండా పోయింది.

జిల్లా వివరాలు..	
గ్రామ పంచాయతీలు	473
మున్సిపాలిటీ వార్డులు	49
సూపర్‌వైజర్‌లు	174
ఎన్యుమరేటర్లు	2186
డాటాఎంట్రీ ఆపరేటర్లు	412

అందని డ్యూటీ సర్టిఫికెట్లు..

సర్వే చేసిన రోజులకు సంబంధించి ప్రభుత్వం ఆన్‌డ్యూటీగా సర్టిఫికెట్లను ఉద్యోగులకు అందించాల్సి ఉంటుంది. కానీ సర్వే ముగిసి ఐదు నెలలు గడిచినా వారికి ఆన్ డ్యూటీ సర్టిఫికెట్లను ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు విన్నవించినా, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. తమకు డ్యూటీ సర్టిఫికెట్లను అందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఖాతాల వివరాలు అందజేత..

సర్వేలో పాల్గొన్న సూపర్‌వైజర్‌లు, ఎన్యుమరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు పారితోషికం జమ చేయడానికి ఆయా మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలకు తమ బ్యాంకు ఖాతాలు అందించారు. అయితే ఇప్పటివరకు ఆ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు.

త్వరలో జమయ్యే అవకాశం

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న సూపర్‌వైజర్‌లు, ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ల పారితోషికాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు జమ చేయాల్సి ఉంది. ఇప్పటికే వారి బ్యాంకు అకౌంట్‌ల వివరాలు పంపించాం. త్వరలోనే పారితోషికం జమయ్యే అవకాశం ఉంది.
– రమేశ్, ఎంపీడీవో, బోథ్

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



వర్షాలతో దెబ్బతిన్న జొన్నపంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని కుమారి గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతు వెంకటరమణ జొన్న పంటను పరిశీలించారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే సంబంధిత అధికారిని పిలిపించి మాట్లాడారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్ల 19 లక్షలతో మంజూరైన మండలంలోని కుమారి నుంచి గాజిలి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అంతకుముందు గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి..

బోథ్: ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ రజతోత్సవంలో తెలంగాణవాదులు, బీఆర్‌ఎస్ నాయకలు, కార్యకర్తలు పాల్గొనాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా దివ్యాంగులకు స్కూటీలు అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

ఎన్నికల హామీలో ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని అనిల్ జాదవ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బోథ్, సొనాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి అందజేశారు. తహసీల్దార్ సుభాష్ చందర్, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా మండలాలకు చెందిన 130 మంది లబ్ధిదారులకు రూ. 30 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణే కాంగ్రెస్ ధ్యేయం



ఆదిలాబాద్‌రూరల్: పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఇందుకు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నలిమెల నవీన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాచ్చర గ్రామంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమ పోతారెడ్డి, కేతిరెడ్డి దామోదర్ రెడ్డి, అడ్డి నరేందర్ రెడ్డి, అల్లకొండ గంగాధర్, దేవన్న, అశోక్, మహేశ్ రెడ్డి, విజయ్, ప్రమోద్, గంగన్న, ముత్తన్న, లింగన్న, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం..

ఇచ్చోడ: పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ నిరంతరంగా పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కుంర కోటేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని పట్వారిగూడ, మాదపూర్, తలమద్రి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు నారయణ్‌రెడ్డి, ముస్తాఫా, లక్ష్మణ్, శేషారావు, మహిబుబ్, దుదిరాం, షాదుల్లా, సంతోష్ పాల్గొన్నారు.

బేల: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాటన్ గ్రామంలో జైబాపు జైభీమ్ జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణ కుమార్, నరసింహస్వామి, నాయకులు రాజు చొప్దే, వినోద్ రెడ్డి, మహేందర్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సమస్యపై ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆదిలాబాద్‌టౌన్: సిరికొండ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఎంపీ గొడం నగేశ్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. చీమన్‌గూడి, సూర్యగూడ, భీంపూర్, కుంటగూడ, పాలవాగులో త్రీఫేజ్ కరెంట్ లేక ఇబ్బందులకు గురవుతున్నామని విన్నవించారు. త్రీఫేజ్ కరెంటు ఫారెస్ట్ క్లియరెన్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతానన్నారు.

ఎంపీకి సన్మానం..

కైలాస్‌నగర్/తాంసి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏయిర్‌పోర్టుతో పాటు ఏయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటుకు కేంద్రం అనుమతిని ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు ఎంపీ గొడం నగేశ్‌ను సన్మానించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, నాయకులు గందె విజయ్‌కుమార్, అల్లూరి నారాయణ రెడ్డి, సాలెంద్ర శివయ్య, చింతల సతీశ్ రెడ్డి, చిట్యాల జగదీశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, తాంసి మండల మాజీ జెడ్పీటీసీ రాజు, నాయకులు సదానంద్, నారాయణ, సుధాకర్ యాదవ్, చంద్రకాంత్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని పెండల్‌వాడ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏడీఈ శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండల్‌వాడ, కౌట, సాంగిడి, సావాపూర్, లేఖర్‌వాడ, ఆకుర్ల గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

ఇచ్చోడ: మండలంలోని దూబార్‌పేట్‌లో బుధవారం హనుమాన్‌చాలీసా సామూహిక పారాయణం నిర్వహించనున్నట్లు దూబార్‌పేట్ పటేల్ కాత్లే గంగారాం తెలిపారు. మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు పూజ అభిషేకం, 7 నుంచి 8 వరకు హోమం, 8 నుంచి 9 వరకు శోభాయాత్ర, 9 నుంచి 11 గంటల వరకు 11 సార్లు సామూహిక హనుమాన్ పారాయణం ఉంటుందన్నారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ ద్వారా ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

11న పంచాయతీ అద్దెగదులకు వేలం

ఇచ్చోడ: మేజర్ పంచాయతీ పరిధిలోని అద్దె గదులకు ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు స్థానికులు, ఎస్టీ తెగలకు చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. వేలంలో పాల్గొనే వారు గతంలో పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండకూడదన్నారు. 7 గదులకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఒక్కొక్క గది కోసం రూ.75 వేల దరావత్తును డీడీ రూపంలో తీసి ఈనెల 11న ఉదయం 12 గంటల వరకు పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

'ప్రణాళికతో ముందుకు సాగితేనే భవిష్యత్తు'

గుడిహత్నూర్: విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగితేనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోగలమని ఎస్సై కె.మహేందర్ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఇటీవలి గ్రూప్ 1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సతీశ్‌కుమార్

బోథ్: మండలంలోని కౌఠ బి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలన, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని, వారి హక్కులకు ఎలాంటి భంగం కలిగిన కాల్ చేయాలన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, టీవీ, మొబైల్‌ఫోన్ లకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శశిధర్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి విజయవంతం చేయాలి



జయంతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో ఈ నెల 14న జరిగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి విజయవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రెలు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులతో కలిసి జయంతి పోస్టర్ ఆవిష్కరించారు. అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మరే, దళిత సంఘాలు, ఆయా పార్టీల నాయకులు మహ్మద్ అంజద్, జితేందర్, శివాజీ, ఉత్తం కాంబ్లే, మస్కే రాజువర్ధన్ ఉన్నారు.

హనుమాన్ చాలీసా పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

నార్నూర్: మండల కేంద్రంలోని పురాతన ఆలయంలో మంగళవారం హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములకు హనుమాన్ చాలీసా పుస్తకాలను హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంతో పాటు సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్ పాల్గొన్నారు.

నేడు కల్యాణ మహోత్సవం



గర్భగుడిలో ఉన్న శివలింగం

గుడిహత్నూర్: మండలంలో నెలకొన్న అతి ప్రాచీన శివాలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో గత ఆరు రోజులుగా జరిగిన సప్తాహంలో ప్రతీరోజు భజనలు, కీర్తనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడో రోజు బుధవారం మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించి సాయంత్రం 6.05 గంటలకు శివపార్వతుల కల్యాణం జరుపనున్నారు. రథోత్సవంలో భాగంగా నగర ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర కొనసాగనుంది. మహారాష్ట్ర 'వార్‌కరీ' సంప్రదాయం ప్రకారం నిర్వహించే వేడుకలో మహిళలు, పురుషులు 'విఠోబా మావులీ తుకారాం' అంటూ నృత్యాలు చేస్తూ ముందుకు సాగుతారు. హనుమాన్ దీక్షాపరులు రథాన్ని లాగుతారు. కల్యాణం అనంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి రానున్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. కళాశాలలో వార్షికోత్సవ పోటీలు రెండోరోజు ఉత్సాహంగా జరిగాయి. మంగళవారం విద్యార్థులకు క్రికెట్, ఖోఖో, క్యారం, చెస్ క్రీడా పోటీలు నిర్వహించారు. లెక్చరర్లు జగ్‌రామ్ అంతర్, డాక్టర్ అరుణ్ కుమార్, రడాపు సంతోష్ కుమార్, బండారి ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతిర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

ఆదిలాబాద్‌టౌన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై క్రైస్తవ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి పలు వీధుల గుండా క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని, దేశంలోని చర్చిలతో పాటు క్రైస్తవ బోధకులు, క్రైస్తవులపై దాడులు జరగకుండా చూడాలని కోరారు. పాస్టర్లు శ్యాముల్, సురేశ్, రాకేశ్, జానియల్, రాజు, ప్రశాంత్, తన్వీర్ రాజు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బ్యాటరీ దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన నసీర్ బేగ్‌కు సంబంధించిన లారీ బ్యాటరీ రెండు రోజుల క్రితం చోరీకి గురైంది. బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెర కాలనీకి చెందిన నిందితుడు రాయ్‌పాన్ సంతోష్ మంగళవారం ఆటోలో వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు విచారించారు. బ్యాటరీ చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఆయనతో పాటు ఖుర్షీద్‌నగర్‌కు చెందిన దాంట్లే కార్తిక్, నిశాంత్ కాంబ్లేలు రెండు బ్యాటరీలను దొంగలించినట్లు పేర్కొన్నారు. అనుమానం రాకుండా ఆటో నంబర్‌ను మార్చడంతో సంతోష్‌పై చీటింగ్ కేసు సైతం నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఏడుగురు వీడీసీ సభ్యుల బైండోవర్

బేల: మండలంలోని సాంగిడి రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలింపు రాయల్టీ వసూలు చేస్తున్న ఏడుగురు వీడీసీ సభ్యులను మంగళవారం పోలీసులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రఘునాథ్‌రావు మాట్లాడుతూ ఇక ముందు ఎవరైనా అక్రమ ఇసుక తరలింపునకు పాల్పడితే ఉపేక్షించబోమని, చట్టారీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆడే గజేందర్‌కు సన్మానం

బోథ్: మండలంలో ధన్నూర్ (బి) గ్రామంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను ముస్లింలు మంగళవారం కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. వారి సమస్యలను ఆయనకు వివరించారు. స్పందించిన ఆడే గజేందర్ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ



వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మణెమ్మ వర్ధంతి పురస్కరించుకొని ఆమె కుమారులు కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరుబావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని మల్యాల్, యాపల్‌గూడ గ్రామాల్లో పర్యటించి వాటర్ ట్యాంకులు, బోరుబావులు, మిషన్‌భగీరథ నీటి సరఫరాను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోరు బావులు అడుగంటి పోయిన గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీవో సత్యానంద్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

22వ రోజుకు సీపీఐ దీక్షలు



దీక్షలో కూర్చున్న నాయకులు

కైలాస్‌నగర్: సర్వే నంబర్ 170, నిషాన్‌ఘాట్‌లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 22వ రోజుకు చేరాయి. దీక్షల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు అరుణ్ కుమార్, కాంబ్లే రాందాస్, సాగర్, చందు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు హిందీభాషా సమితి సభ్యుల సన్మానం



డీఈవోను సన్మానిస్తున్న సమితి సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఏనుగు శ్రీనివాస్ రెడ్డిని హిందీ భాషా సమితి సభ్యులు సన్మానించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్పాట్ కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సమితి సభ్యులు చేపడుతున్న కార్యక్రమాల వివరాలను ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, మహేశ్, సాంబన్న, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎక్స్‌రోడ్డు గ్రామంలో ఓ ఇంటి ముందు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత క్షుద్రపూజలు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ ఇంటి ముందు క్షుద్రపూజలు చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలో ఓ ఇంటి ముందు క్షుద్ర పూజలు చేయడంతో పాటు గుంత తవ్వినట్లు పేర్కొన్నారు. క్షుద్ర పూజలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉట్నూర్ సీఐ మొగిలిని వివరణ కోరగా క్షుద్రపూజలు చేసినట్లు సమాచారం వచ్చిందని దీనిపై విచారణ చేపట్టామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నేరడిగొండ: సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన చలివేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి



కెరమెరి: నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ వాడలో ఎంపీ నిధులతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గత కొంత కాలంగా మట్టి, దుబ్బల్లో నడిచే ప్రజలకు ఇక కష్టాలు తీరినట్లేనని పేర్కొన్నారు. నాయకులు తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899